సాక్షి
తిరుపతి
ఆదివారం । 23 । జూన్ । 2024



హనుమంతుడిపై చిద్విలాసం

అప్పలాయగుంటలోని శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు హనుమంత వాహనంపై ఊరేగారు. - 8లో



సెజ్‌లో వ్యర్థాలు పూడ్చే యత్నం

మేనకూరు సెజ్‌లో డంపింగ్ యార్డ్ యజమాని విషపూరిత వ్యర్థాలు పూడ్చేందుకు యత్నించాడు. - 8లో



విద్యార్థులకు అస్వస్థత

కలుషిత నీరు తాగి విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటన శనివారం గూడూరు మండలంలో చోటుచేసుకుంది. - 8లో

అడ్డదిడ్డంగా తవ్వకాలు..
అడ్డొస్తే బెదిరింపులు

అధికారంలోకి వచ్చి రోజులు గడవకముందే టీడీపీ నేతలు అక్రమ సంపాదన కోసం ఆవురావురమంటూ అడుగులు వేస్తున్నారు. ప్రకృతి సంపదను కొల్లగొట్టి జేబులు నింపుకునేందుకు సిద్ధమైపోయారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలు మండలాల్లో ఇప్పటికే గ్రావెల్, మట్టి, ఇసుక దందాకు శ్రీకారం చుట్టేశారు. నాడు నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ అభ్యంతరం వ్యక్తం చేసిన చోటే తవ్వకాలు ఆరంభించేశారు. మరో వైపు గతంలో టెండర్ పాడుకున్న వారు నిల్వచేసిన ఇసుకను ఎత్తుకెళ్లేందుకు ప్రణాళికను రచించేశారు. ఏమైనా అంటే 'ఎమ్మెల్యే తాలూకు.. మనుషులం'అంటూ బెదిరింపులకు దిగుతున్నారు. శనివారం 'సాక్షి' పరిశీలనలో అడుగడుగునా కనిపించిన అక్రమ తవ్వకాలు.. దోపిడీలపై స్పెషల్ ఫోకస్..



పూతలపట్టు మండలం, వావిల్ తోట నుంచి ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా ఇసుక తరలిస్తున్న టీడీపీ నేతలు

సాక్షి టాస్క్‌ఫోర్స్

- ప్రకృతి వనరులను కొల్లగొడుతున్న కూటమి నేతలు
- ఉమ్మడి జిల్లాలో ఇష్టారాజ్యంగా గ్రావెల్, మట్టి, ఇసుక తవ్వకాలు
- వ్యవసాయ భూముల్లో రైతుల అనుమతి లేకున్నా దౌర్జన్యాలు
- పెళ్లకూరు, నాగలాపురం, పూతలపట్టు మండలాల్లో రెచ్చిపోతున్న తెలుగు తమ్ముళ్లు
- కన్నెత్తి చూడని రెవెన్యూ, మైనింగ్ శాఖలు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా కూటమి శ్రేణులు గ్రావెల్, ఇసుక, మట్టిని ఇష్టారాజ్యంగా తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గం, పెళ్లకూరు మండల పరిధిలోని నందిమాల, ఎర్రగుంట, శిరసనంబేడు,



నాగలాపురం : ఎమ్మెల్యే తాలూకా.. మనుషులమంటూ పోలీసులతో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

రోసనూరు, రాజుపాళెం, అర్ధమాల, పునబాక తదితర గ్రామాల్లో గ్రావెల్‌ను వేల క్యూబిక్ మీటర్ల వరకు గ్రావెల్‌ను తవ్వేస్తున్నారు. భారీ యంత్రాలతో టిప్పర్లు, ట్రాక్టర్లు, లారీలకు నింపుకుని ప్రైవేటు కంపెనీలకు విక్రయించి జేబులు నింపుకుంటున్నారు. శిరసనంబేడు గ్రామంలోని సిద్ధేశ్వర స్వామి కొండ సమీపంలో అసైన్డ్ భూముల్లో అక్రమ గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్నారు. నాయుడుపేట పరిసరాల్లో లేఅవుట్లు, మేనకూరు సెజ్‌లో పరిశ్రమలకు, 71వ జాతీయ రహదారి రోడ్డు అభివృద్ధి పనులకు గ్రావెల్, మట్టికి మంచి డిమాండ్ ఉండడంతో టీడీపీ నేతలు ఇదే అదునుగా రెచ్చిపోతున్నారు. యంత్రాలతో తవ్వకాలు చేపట్టినా మామూళ్ల మత్తులో జోగుతున్న కొందరు అధికారులు అటు వైపు కన్నెత్తి చూడడం లేదు.



ఎర్రగుంట చెరువులో యంత్రాలతో గ్రావెల్ తవ్వకాలు

డోంట్ కేర్

శిరసనంబేడు, రోసనూరు, అర్ధమాల, నందిమాల, ఎర్రగుంట గ్రామ పరిసరాల్లో గ్రావెల్ తవ్వకాలు చేపట్టరాదన్న కోర్టు ఆదేశాలు ఉన్నాయి. కానీ ఇక్కడి టీడీపీ నేతలు అవేవీ పట్టించుకోవడం లేదు. మరో వైపు 5వేల క్యూబిక్ మీటర్లకు మాత్రమే గ్రావెల్ తవ్వాలకు అనుమతి ఉన్నా.. 50 వేల క్యూబిక్ మీటర్లకు పైగా తవ్వకాలు చేపడుతున్నారు.

నిల్వ ఉంచిన ఇసుకను ఎత్తుకెళ్లేందుకు స్కెచ్

సత్యవేడు నియోజకవర్గం, నాగలాపురం మండలంలోని సుబ్బానాయుడుకండ్రిగ ఇసుక రీచ్‌ని గతంలో కాంట్రాక్టర్ టెండర్ దక్కించుకున్నారు. ఎన్నికల కోడ్ రాక ముందు వరకు తవ్విన ఇసుకను నిల్వచేశారు. కోడ్ రావడంతో ఇసుక తరలించడాన్ని నిలిపివేశారు. ఆ భారీ ఇసుక డంప్‌పై కన్నుపడ్డ టీడీపీ నేతలు శనివారం టిప్పర్లు, ట్రాక్టర్లను దించారు. స్థానిక ఎమ్మెల్యే తాలూకా.. మనుషులమంటూ వాహనాల్లో ఇసుకను నింపుకున్నారు. విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. రీచ్‌కు చేరుకున్న పోలీసులు వాటి గురించి ఆరాతీయగా.. ఎమ్మెల్యే పంపారని, అందుకే వచ్చామంటూ హడావుడి చేశారు. అనుమతి పత్రాలు కోరడంతో అక్రమార్కులు అన్‌లోడ్ చేసి అక్కడి నుంచి వెనుదిరిగారు. ఎమ్మెల్యే పేరు చెప్పడంతో పోలీసులు వారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు.



నాగలాపురం : సుబ్బానాయుడు కండ్రిగ రీచ్‌లో నిల్వ ఉంచిన ఇసుకను వాహనాలకు నింపిన టీడీపీ నేతలు

పూతలపట్టులో బరితెగింపు

చిత్తూరు జిల్లా, పూతలపట్టు పరిధిలోని వావిల్ తోట ఇసుక రీచ్‌లో టీడీపీ నేతలు విచ్చల విడిగా తవ్వకాలు చేపట్టారు. వందల ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ముచేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఎన్నికలకు ముందు వావిల్ తోటలో ఇసుక తవ్వకాలు చేపట్టడానికి వీల్లేదని చిత్తూరు జాయింట్ కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. ఎన్నికల ఫలితాల తర్వాత ఆ నిబంధనను టీడీపీ నేతలు తుంగలో తొక్కేశారు. గత కొద్ది రోజులుగా ఇక్కడ ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు చేపట్టారు. వందల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మరో టీడీపీ నేత ఇదే పూతలపట్టు మండలం, అబ్బిరెడ్డి ఊరు సమీపంలోని వంకలో ఇసుకను అక్రమంగా తవ్వి మూర్తిగానూరు గ్రామంలో డంప్ చేసుకున్నారు. శుక్ర, శనివారాల్లో మాత్రమే సుమారు 120 ట్రాక్టర్ల వరకు డంప్ చేసినట్లు స్థానికులు గుర్తించారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

చర్యలు చేపడుతాం

శిరసనంబేడులోని సిద్ధేశ్వరకొండ, యర్రగుంట, నందిమాల చెరువులు, రోసనూరు, అర్ధమాల అటవీ భూములు, పలు ప్రాంతాల్లోని అసైన్‌మెంట్ భూముల్లో అక్రమ తవ్వకాలపై ఫిర్యాదులు వస్తున్నాయి. జిల్లా మైనింగ్ అధికారులతో మాట్లాడి అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు చేపడుతాం.

–చంద్రముని, సూళ్లూరుపేట ఆర్డీఓ



టిప్పర్లకు గ్రావెల్ నింపుతూ..



ఎర్రగుంట చెరువులో ఏర్పడిన ప్రమాదకర గుంతలు



సుబ్బానాయుడు కండ్రిగ ఇసుక రీచ్



యంత్రాలతో గ్రావెల్ తవ్వకాలు

న్యూస్‌రీల్

ఆగమోక్తంగా తైలాభిషేకం



ప్రత్యేక అలంకరణలో శనీశ్వరస్వామి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి నువ్వుల నూనె, మంచినూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని పలు పుష్పాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

రేపు ఉద్యోగ మేళా

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో సోమవారం జేకేసీ ఆధ్వర్యంలో ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీలత తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తిరుపతికి చెందిన శ్రీజ మహిళా మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీలో జూనియర్ ఎగ్జిక్యూటివ్ కోసం డిగ్రీ బీఎస్సీ, కెమిస్ట్రీ, మైక్రో బయాలజీ చదివి, రెండేళ్ల అనుభవం గల పురుషులు అవసరమని, వారికి టూ వీలర్ డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. వార్షిక వేతనం రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఉంటుందని, ఇతర అలవెన్సులు కూడా ఉంటాయని పేర్కొన్నారు. అదేవిధంగా ఎస్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ ప్రయివేట్ లిమిటెడ్‌లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 8074461722, 9440502338 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ ఏటీసీ వద్దకు చేరుకుంది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 72,294 మంది స్వామివారిని దర్శించుకోగా, 31,855 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.39 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టిక్కెట్లు లేని భక్తులకు 15 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఫ్లో బస్ బృందాన్ని అభినందించిన వీసీ

తిరుపతి సిటీ: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ఫ్లో బస్‌ను అభివృద్ధి చేసిన ఎడోద్వాజ ఫౌండేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులను, వర్సిటీ టీబీఐ బృందాన్ని శనివారం మహిళా వర్సిటీ వీసీ డీ.భారతి, రిజిస్ట్రార్ రజిని, ప్రొఫెసర్ ఎస్.జ్యోతి ప్రత్యేకంగా అభినందించారు. శ్రీపద్మావతి మహిళా వర్సిటీ టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్(టీబీఐ) సెంటర్ నిధులతో హైదరాబాద్‌కు చెందిన ఎడోద్వాజ ఫౌండేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అభివృద్ధి చేసిన ఫ్యూచరిస్టిక్ ల్యాబ్ ఆన్ వీల్స్ (ఫ్లో బస్)ను తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి గత వారం హైదరాబాద్‌లో ప్రారంభించారు. సౌరశక్తితో పనిచేసే ఫ్లో బస్‌లో రోబోటిక్స్, త్రీడీ, హోలోగ్రామ్, ప్లానెటోరియంతో సహా అత్యాధునిక సాంకేతికతతో కూడిన మొబైల్ ప్రయోగశాలగా రూపొందించారు. వీసీ భారతి మాట్లాడుతూ అధునాతన సెన్సార్లతో అనుసంధానించి ఉండడంతో సబ్‌స్క్రిప్షన్ మోడల్ ద్వారా పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు వర్క్‌షాపుగా ఉపయోగపడుతుందని తెలిపారు.

వైభవంగా ప్రదోష నందిసేవ



ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాయలంలో శనివారం రాత్రి ప్రదోష నందిసేవ వైభవంగా జరిగింది. ముందుగా ఆలయ అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లకు పలురకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. ఆలయ ప్రాకారంలో ప్రదోష నందిసేవ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

వెన్నెల రేడు!



తిరుమలలో శనివారం రాత్రి పున్నమి గురుడ సేవ వైభవంగా జరిగింది. శ్రీనివాసుడు గరుడ వాహనంపై విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించి తరించారు. కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

– తిరుమల

డయేరియా నియంత్రణపై అవగాహన



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ ధ్యానచంద్ర

తిరుపతి అర్బన్: డయేరియా నియంత్రణకు సంబంధించి ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలని ఇన్‌చార్జి కలెక్టర్ ధ్యానచంద్ర సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఆయన కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, స్త్రీశిశు సంక్షేమ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాతావరణంలో వస్తున్న మార్పుల నేపథ్యంలో జూలై 1 నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు రెండు నెలల పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. వ్యాధులు సోకకుండా అన్ని చర్యలు చేపట్టాలన్నారు. మంచినీటి ట్యాంకులు పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. 0 నుంచి 5 ఏళ్ల లోపు చిన్నారుల మరణాలను నియంత్రించాలని కోరారు. డయేరియా నియంత్రణపై ఈనెల 24 నుంచి 30 వరకు గ్రామ, వార్డు సచివాలయాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, పీహెచ్‌సీలు, జిల్లా స్థాయిలో అందరూ చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరిని ఆదేశించారు. ఇసుక అక్రమ తవ్వకాలకు తావులేకుండా రెవెన్యూ, పోలీస్ అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ఆ మేరకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేయాలని చెప్పారు. జిల్లా రెవెన్యూ అధికారి పెంచలకిషోర్ పాల్గొన్నారు.

పీహెచ్‌డీ లేకున్నా అధ్యాపకులకు పదోన్నతి

- నిబంధనలు సడలించిన యూజీసీ
- ఎస్వీయూ, మహిళా వర్సిటీల్లో 34 మందికి లబ్ధి

తిరుపతి సిటీ: యూనివర్సిటీ అధ్యాపకుల ప్రమోషన్ల విషయంలో కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (సీఏఎస్)కు సంబంధించి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) తీపికబురు అందించింది. పదోన్నతుల విషయంలో అధ్యాపకుల విన్నపం మేరకు అర్హతా ప్రామాణికాలను సడలిస్తూ అన్ని యూని వర్సిటీలకు శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. 2018 నిబంధనల ప్రకారం అధ్యాపకులు పదోన్నతి పొందాలంటే పీహెచ్‌డీతో పాటు పబ్లికేషన్లపైన కఠిన నిబంధనలు విధించింది. దీంతో పీహెచ్‌డీ లేని అధ్యాపకులు పదోన్నతులకు నోచుకోలేదు. నిబంధనలు సడలించాలని అధ్యాపకులు పలు మార్లు యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్‌కు మొరపెట్టుకున్నారు. స్పందించిన యూజీసీ అధికారులు 2010 పాత నిబంధనల ప్రకారం పీహెచ్‌డీ అర్హత లేకున్నా పదోన్నతి పొందేందుకు అర్హులేనని ఆదేశాలు జారీ చేసింది. పాత నింబంధనల ప్రకారం ఈ ఏడాది డిసెంబర్ 31వ తేదీ లోపు అర్హులైన అధ్యాపకులు పదోన్నతులు పొందేందుకు అవకాశం కల్పించింది. దీంతో ఎస్వీ యూని వర్సిటీలో సుమారు 22మంది, మహిళా వర్సిటీలో 12 మందికిపైగా అధ్యాపకులు లబ్ధిపొందే అవకాశం ఉంది. యూజీసీ నిబంధనల సడలింపుపై వర్సిటీ అధ్యాపకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

చోరీ కేసులో ముగ్గురి అరెస్ట్



మాట్లాడుతున్న డీఎస్పీ భవ్యకిషోర్

రేణిగుంట: రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి ఓ మోటార్‌బైక్, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్టు రేణిగుంట డీఎస్పీ భవ్యకిషోర్ తెలిపారు. రేణిగుంట పోలీస్ స్టేషన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి అవిలాల వినాయకనగర్‌కు చెందిన వీ.అంజి(24), లింగేశ్వరనగర్‌కు చెందిన ఎం.అజిత్(25), శివగంగా నగర్‌కు చెందిన భాస్కర్ ధనుష్(23) ఈనెల 17వ తేదీ రాత్రి రేణిగుంట సమీపంలో అటుగా వస్తున్న ఓ వ్యక్తి పై దాడి చేసి గాయపరిచారు. అతని వద్ద నుంచి నగదు, బైక్ తీసుకుని పరారయ్యారు. ఈ మేరకు సీసీ పుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించారు. రేణిగుంట సీఐ మల్లికార్జున, ఎస్‌ఐలు అరుణ్‌కుమార్‌రెడ్డి, జావేద్‌బాషా తమ సిబ్బందితో కలసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. వారి కదలికలపై నిఘా పెట్టి శనివారం ఉదయం రేణిగుంట వేణుగోపాలపురం సమీపంలో రైల్వే స్టేషన్ క్రాస్ వద్ద ముగ్గురినీ అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ వివరించారు.

వివాహిత అదృశ్యం

వరదయ్యపాళెం: కుటుంబ కలహాలతో తన ఇద్దరి పిల్లలను వెంటబెట్టుకుని వివాహిత అదృశ్యమైన ఘటన మండలంలోని చిన్న పాండూరు అరుంధతివాడలో చోటుచేసుకుంది. శ్రీసిటీ హైటెక్ పోలీస్ స్టేషన్‌లో బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చిన్న పాండూరు అరుంధతివాడకు చెందిన సురేంద్ర, జ్యోతికి ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఏడేళ్ల కుమారుడు, ఆరేళ్ల కుమార్తె ఉన్నారు. అయితే భార్యాభర్తల నడుమ ఈ నెల 20న వివాదం తలెత్తింది. మనస్తాపం చెందిన జ్యోతి (27), తన కుమారుడు సుకుమార్ (7), కుమార్తె నిఖి(6)లను వెంటబెట్టుకుని ఇంట్లో ఎవరూ లేని సమయంలో బయటకు వెళ్లినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అయితే రెండు రోజులుగా వారు ఇంటికి రాకపోవడంతో జ్యోతి సోదరుడు సుబ్రమణ్యం శ్రీసిటీ హైటెక్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదుపై స్పందించిన ఎస్‌ఐ గౌస్ పీర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హనుమంతుడిపై శ్రీవారి చిద్విలాసం



హనుమంతుడిపై ఊరేగుతున్న శ్రీవారు



గజ వాహనంపై అభయమిస్తున్న గోవిందుడు

పుత్తూరు: అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో ఆరోరోజు శనివారం ప్రసన్న వేంకటేశ్వరస్వామి హనుమంత, గజ వాహనాలపై విహరించారు. పట్టుపీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలతో ముగ్ధమనోహర రూపంలో గోవిందుడు హనుమంతుడి భుజాలపై ఆసీనుడై అశేష భక్తులను కటాక్షించారు. ఉదయం 5 గంటలకు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొల్పి విశ్వరూప దర్శనం, తోమాలసేవ, కొలువు, అర్చన, మొదటి గంట తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 7.30 గంటలకు శ్రీవారు వాహన మండపంలోకి వేంచేపు చేశారు. 8 నుంచి 9 గంటల వరకు గోవిందుడు హనుమంత వాహనంపై ఊరేగుతుండగా అశేష భక్తుల గోవింద నామస్మరణతో మాడవీధులు మార్మోగాయి. తదుపరి శుద్ధి, రెండవ గంట కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి భక్తులను స్వామి దర్శనానికి అనుమతించారు. 3 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పుణ్యాహవచనం, వసంతోత్సవాలను వేదపండితులు వైభవోపేతంగా నిర్వహించారు. శ్రీవారి గ్రామోత్సవం అనంతరం 6.30 గంటలకు స్వామివారు వాహన మండపంలోకి వేంచేపు చేశారు.

గజరాజుపై అభయం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి 7 గంటలకు స్వామివారు పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరితుడై గజ వాహనంపై విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, చిన్నారుల కోలాటాల నడుమ అశేష భక్తజనం స్వామివారిని కనులారా వీక్షించి తరించారు. ఏఈఓ రమేష్, ఆలయ సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సూర్యప్రభ వాహనంపై స్వామివారు దర్శనమిస్తారు. సాయంత్రం 5.30 గంటల నుంచి 6.30 వరకు ఊంజల్ సేవ, రాత్రి 7 గంటల నుంచి 8 వరకు చంద్రప్రభ వాహనంపై స్వామివారు విహరిస్తారు.

కలుషిత నీరు తాగి విద్యార్థులకు అస్వస్థత

గూడూరు రూరల్: మధ్యాహ్న భోజన సమయంలో కలుషిత నీరు తాగి ఎనిమిది మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటన గూడూరు రూరల్ మండలం, చెన్నూరులో చోటుచేసుకుంది. వివరాలు.. చెన్నూరులోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో మినరల్‌వాటర్ ప్లాంట్‌కు నీటిని సరఫరా చేసే పైప్ లైన్ మరమ్మతులకు గురైంది. అదే సమయంలో విద్యార్థులు భోజనానికి కూర్చుని నీటిని పట్టుకుని తాగారు. అర్ధగంట తర్వాత విద్యార్థులు వాంతులు, విరోచనాలతో విలవిల్లాడిపోయారు. వార్డెన్‌తో పాటు ఉపాధ్యాయులు హుటాహుటిన వారిని గూడూరు ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. అనంతరం వారి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వగా వారు హాస్పిటల్‌కు చేరుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యపరిస్థితి నిలకడగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. వార్డెన్ కోటేశ్వరరావును వివరణ కోరగా మినరల్ వాటర్ ప్లాంట్‌కు నీటిని సరఫరా చేసే పైప్‌లైన్ మరమ్మతులకు గురైందని, ఆ నీటిని తాగడం వల్ల విద్యార్థులకు ఇబ్బంది కలిగిందన్నారు. వెంటనే పైప్‌లైన్‌ను మరమ్మతులు చేసినట్టు వివరించారు.

శాస్త్రోక్తంగా తిరుచ్చి ఉత్సవం



స్వామి, అమ్మవార్లకు అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు



తిరుచ్చిపై విశేష అలంకరణలో స్వామి,అమ్మవార్లు

రాపూరు: పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీరసింహ స్వామి దేవస్థానంలో శనివారం జ్యేష్టాభిషేకాన్ని పురస్కరించుకుని స్వామి, అమ్మవార్ల తిరుచ్చి ఉత్సావాన్ని వైభవంగా నిర్వహించారు. జేష్ఠ మాసంలో జేష్ఠ నక్షత్రం, పౌర్ణమి ఒకేరోజు వచ్చిన సందర్భంగా వైష్ణవ దేవస్థానాల్లో హోమం, అభిషేకాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా శనివారం ఉదయం సుప్రభాతం, అభిషేకం, పూలంగి సేవ, నరసింహ హోమం నిర్వహించారు. తర్వాత శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో నరసింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మీదేవిల ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి విగ్రహాల ముందు 81 కలశాలు ఏర్పాటుచేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ కలిశాల్లోని జలాలతో స్వామి, అమ్మవర్లకు అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

సెజ్‌లో ప్రమాదకర వ్యర్థాల పూడ్చివేతకు యత్నం



వ్యర్థాలు పూడ్చుతున్న దృశ్యం

తడ: ఏపీఐఐసీ మాంబట్టు సెజ్‌లో ప్రమాదకర వ్యర్థాలను పూడ్చేందుకు యత్నించిన వ్యక్తిని స్థానికులు అడ్డుకున్న ఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. తిరుపతికి చెందిన హర్షవర్దన్ సెజ్ పరిధిలో ప్రభుత్వం ద్వారా తీసుకున్న భూమిని పాండిచ్చేరిలో ఉంటున్న షేర్‌అలి అనే వ్యకికి లీజుకు ఇచ్చాడు. అతను అందులో తిరుమల రీసైక్లింగ్ పేరుతో వ్యాపారం నిర్వహించేందుకు అనుమతులు తీసుకున్నాడు. అనుమతి పొందిన వ్యాపారం కాకుండా రీ సైక్లింగ్‌కు పనికి రాని ఎఫ్ఆర్‌పీ అనే ప్రమాదకరమైన మెటీరియల్‌ను మరొక పరిశ్రమ నుంచి సేకరించాడు. అది భారీగా నిల్వ చేరడంతో ఇటీవల అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. వారం రోజుల పాటు మంటలు అదుపులోకి రాలేదు. చివరకు మట్టి పోసి మంటలను అదుపుచేయాల్సి వచ్చింది. స్థలం లీజుకు తీసుకున్న సంస్థ ప్రతినిధులు భారీ యంత్రాలను తీసుకొచ్చి కాలిపోయిన చెత్తను భూమిలో పాతిపెట్టేందుకు ప్రయత్నించారు. భూమిలో ఇంకితే నీరు కలుషితమవుతుందని పరిశ్రమల ప్రతినిధులు, స్థానికులు అడ్డుకున్నారు.

అతనికి టీడీపీ అండదండలు?

వ్యర్థాలను భారీగా నిల్వ ఉంచి స్థానికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన వ్యక్తి సూళ్లూరుపేట నియోజకవర్గానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడి అడదండలు ఉన్నాయని ప్రచారం సాగుతోంది. అగ్నిప్రమాదం జరిగిన సమయంలో ఎలాంటి సహాయక చర్యలు చేపట్టని ఆ యజమాని, కాలిపోయిన అనంతరం ఇన్సూరెన్స్ కోసం తడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయించేందుకు వచ్చాడు. ఎస్‌ఐ నిరాకరించడంతో టీడీపీ నాయకుడు రంగంలోకి దిగి కేసు నమోదు చేయాలని ఫోన్‌లో పోలీసులను ఆదేశించినట్టు తెలిసింది.

దైవ దర్శనానికి వెళ్లొస్తూ..

కానరాని లోకాలకు

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఆంధ్రా భక్తుల మృతి
- తొమ్మిది మందికి తీవ్రగాయాలు



రోడ్డు పక్కన చెట్టును ఢీకొన్న కారు

వేలూరు: ఆంధ్ర రాష్ట్రం తిరుపతి సమీపంలోని కొత్తకోట గ్రామానికి చెందిన తవిటినాయుడు కుమారుడు జగన్‌మోహన్(17), రెడ్డిగుంటకు చెందిన గోపాల్ భార్య ప్రవళిక(34)తో పాటు మొత్తం 11 మంది శుక్రవారం సాయంత్రం పౌర్ణమి సందర్భంగా తిరువణ్ణామలైలోని అరుణాచలేశ్వరాలయ గిరి వలయం వెళ్లేందుకు కారులో వచ్చారు. వీరందరూ శుక్రవారం రాత్రి గిరివలయం రోడ్డులోని 14 కిలో మీటర్ల దూరం కాలి నడకన నడిచి వెళ్లి అనంతరం స్వామి దర్శనం చేసుకున్నారు. శనివారం వేకువజామున అదే కారులో తిరుపతి వెళ్లేందుకు బయలుదేరారు. తిరువణ్ణామలై జిల్లా కలశపాక్కం సమీపంలోని కురివిమలై వద్ద వస్తున్న సమయంలో వేలూరు నుంచి ప్రయాణికులతో వస్తున్న ప్రభుత్వ బస్సు- కారు ఢీకొన్నాయి. వెంటనే కారు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న జగన్‌మోహన్, ప్రవళిక అక్కడిక్కడే మృతి చెందారు. కారులోని డ్రైవర్‌తో పాటు మొత్తం తొమ్మిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులతో కలిసి కలశపాక్కం పోలీసులు క్షతగాత్రులను, మృతదేహాలను తిరువణ్ణామలై ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

- మరొకరికి గాయాలు

డక్కిలి: మండలంలోని వెంకటగిరి–రాపూరు జాతీయ రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా ఒకరికి తీవ్ర గాయాలైన ఘనట శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు కథనం మేరకు వివరాలి ఉన్నాయి. వెంకటగిరి రూరల్ మండలం, పాపమాంబపురం గ్రామానికి చెందిన మన్నూరు పోతయ్య, వేల్పూరు సునీల్, అంతటి వీరబాబులు రాపూరు మండలం, ఏపూరులో ఎలక్ట్రిషియన్ పనులు చేసి శుక్రవారం రాత్రి తిరిగి స్వగ్రామం అయిన పాపమాంబపురానికి మోటారు బైక్‌లో వెళ్తున్నారు. మార్గమధ్యంలోని పలుగోడు గ్రామ సమీపంలో నెల్లూరు నుంచి చేపలు లోడ్డుతో వెళ్తున్నవాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రులను వెంకటగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పోతయ్య, వీరబాబు మృతి చెందారు. ఈమేరకు డక్కిలి ఎస్‌ఐ చౌడయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గరుడ వాహనంపై కల్యాణ వెంకన్న



గరుడ వాహనంపై విహరిస్తున్న గోవిందుడు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు శనివారం రాత్రి పౌర్ణమి సందర్భంగా గరుడ వాహనంపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. తెల్లవారుజామున స్వామివారిని సుప్రభాత సేవలో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. తదుపరి స్వామివారికి అభిషేక సేవను నిర్వహించి, మరకత మాణిక్యాలు, వజ్రవైఢూర్యాలతో శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో విద్యుత్ కాంతుల నడుమ స్వామివారికి ఊంజల్ సేవను కనుల పండువగా నిర్వహించారు. అనంతరం శ్రీస్వామివారి ఉత్సవమూర్తిని సర్వాంగ సుందరంగా అలంకరించి గరుడ వాహనంపై కొలువుదీర్చి పూజలు చేశారు. తదుపరి వేద మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ తిరుమాడ వీధుల్లో గరుడ సేవ నయనానందకరంగా సాగింది. ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపీనాథ్, సూపరింటెండెంట్ చెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి, అర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చక స్వామి బాలాజీ రంగాచార్యులు పాల్గొన్నారు.

కేంద్రంలో బీజేపీ కొనసాగడం కష్టం

గూడూరు రూరల్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం త్వరలో అధికారం కోల్పోయే ప్రమాదం ఉందని మాజీ ఎంపీ చింతా మోహన్ జోస్యం చెప్పారు. గూడూరు టవర్ క్లాక్ ప్రాంతంలో శనివారం ఆయన కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలసి దుగ్గరాజపట్నం పనులు వెంటనే ఆరంభించాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ కొనసాగడం కష్టతరమన్నారు. చంద్రబాబుకు పోలవరంపై ఉన్న ప్రేమ దుగ్గరాజు పట్నంపై ఎందుకు లేదని ప్రశ్నించారు. దుగ్గరాజపట్నం ఓడరేవు పనులు వెంటనే ఆరంభించాలని డిమాండ్ చేశారు. గూడూరు మహా పట్టణంగా మారాలంటే దుగ్గరాజపట్నం ఓడరేవు రావాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఉయ్యాల రామక్రిష్టారావు, దయాకర్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.